క్లుప్తంగా

కొండూరికి వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

గంభీరావుపేట: మండలంలోని ముస్తఫానగర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించుకునేందుకు గత ప్రభుత్వం లబ్ధిదారుల జాబితా ప్రకటించింది. లబ్ధిదారులు తమస్థలాల్లో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఆందోళనకు గురవుతున్నారు. కేవలం పేర్లు మాత్రమే ప్రకటించారని, వెంటనే తమకు మంజూరు ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతున్నారు. శనివారం టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావును కలిసి వినతిపత్రం అందించారు. మండల వార్డుసభ్యుల ఫోరం కన్వీనర్ బండ రమేశ్, తదితరులున్నారు.

నేడు ప్రభుత్వ విప్ పర్యటన

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి, గోవిందరావుపేట తండాలో ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫి రోజ్ పాషా తెలిపారు. గోవిందరావుపేట తండాలో గ్రామ పంచాయతీ భవనం ప్రారంభించి, మహిళా సంఘ భవన భూమిపూజలో పాల్గొంటారన్నారు. మామిడిపల్లిలో నిర్వహించే కృతజ్ఞతా ర్యాలీలో పాల్గొంటారని పేర్కొన్నారు.
రుద్రంగి(వేములవాడ): మండలకేంద్రంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆదివారం పాల్గొనున్నట్లు సర్పంచ్ ప్రభలత ఒక ప్రకటనలో తెలిపారు.

క్రీడలతో స్నేహభావం పెంపు



మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్

బోయినపల్లి: మండలంలోని మల్కాపూర్‌లో సర్పంచ్ కోరెపు నరేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను ఎస్సై శ్రీకాంత్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో యువతలో స్నేహభావం పెరుగుతుందని, క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొలన్నారు. కార్యక్రమంలో గ్రామయుకులు, క్రీడాకారులు ఉన్నారు.

'పది' విద్యార్థులకు అల్పాహారం



విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న ఫిల్లింగ్ స్టేషన్ యజమానులు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని హన్మాజిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఫిల్లింగ్‌స్టేషన్ యజమానులు అల్పాహారం అందించారు. పరీక్షలు జరిగే వరకు రోజూ సాయంత్రం స్టడీ అవర్స్‌లో అల్పాహారం అందించేందుకు వారు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా వారిని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం ధన్యవాదాలు తెలిపారు. సీహెచ్ శ్రీకాంత్‌రావు, జనార్దన్, కార్తీక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు జీపీ భవనం ప్రారంభం

బోయినపల్లి: కోరెం గ్రామపంచాయతీ భవనాన్ని ఆదివారం రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నట్లు సర్పంచ్ రాజ్యలక్ష్మి తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొంటారని పేర్కొన్నారు.

మైక్ సెట్ వితరణ

గంభీరావుపేట: మండలంలోని మల్లుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గడ్డి సతీశ్ రూ.10వేల విలువైన మైక్‌సెట్‌ను విరాళంగా అందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సతీశ్‌ను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నలుగురి రిమాండ్

బోయినపల్లి(చొప్పదండి): చోరీ కేసులో నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని వరదవెల్లిలో ఇన్‌ఫోల్ రెగ్యులేటర్, కాపర్ వైర్లు, జనరేటర్ బ్యాటరీని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని కొదురుపాక సెక్షన్ ఏఈఈ రాధిక ఈనెల 24న ఫిర్యాదు చేశారు. అగ్రహారంకు చెందిన వల్లెపు పర్శరాములు, గంధం సతీశ్‌తోపాటు సొత్తు స్వీకరించిన మోతె దుర్గయ్య, మామిండ్ల మహేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విజయవంతం చేయాలి

ముస్తాబాద్: నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమావేశానికి పార్టీశ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని మండలశాఖ అధ్యక్షుడు సురేందర్‌రావు కోరారు. సిరిసిల్లలో ఆదివారం జరిగే నియోజకవర్గ సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలన్నారు.

బోసినవ్వులు పదిలంగా..

- చిన్నారుల బర్త్ డే, ఇతర స్పెషల్ డేస్‌కు బేబీ ఫొటో షూట్స్
- ఇండోర్..ఔట్‌డోర్లలో ఫొటోలు
- పట్టణంలో ఫొటోషూట్స్‌కు పెరిగిన ఆదరణ

సిరిసిల్లటౌన్: ఆధునిక యుగంలో రోజులు క్షణాల్లా గడుస్తున్నాయి. అందుకే పెళ్లిల్లు..శుభకార్యాల మధురజ్ఞాపకాల కోసం ఖర్చుకు వెనుకాడకుండా అందమైన ఆల్బమ్స్‌గా మల్చుకుంటున్నారు. తమ చిన్నారుల బోసినవ్వులను జీవితాంతం గుర్తుండేలా మధురానుభూతి పొందేలా ఉవ్విళ్లూరుతున్నారు. ఫొటోగ్రఫీతో కంటి'పాప'ల ఆనందాలను పెద్దయ్యాక తమ పిల్లలకు అందంగా గిఫ్ట్ ఇచ్చేందుకు చేస్తున్న 'క్యూట్..షూట్'పై సండేస్పెషల్













అందంగా చిత్రీకరణ

కిడ్స్ షూట్స్ పేరుతో సిరిసిల్లలో పలు ఫొటో స్టూడియోలు వెలిశాయి. ఇండోర్ స్టూడియోలో త్రీ డీ కళారూపాలతో చూడగానే అదుర్స్ అనే విధంగా సెట్టింగ్స్‌ను తయారు చేశారు. సినిమాల్లో మాదిరిగానే సెట్టింగ్స్‌తో చిన్నారులను అందంగా చిత్రీకరిస్తున్నారు. లొకేషన్స్, సీనరీస్‌ను పోలిన సెట్టింగ్స్‌లో ముద్దులొలికే పిల్లలను అందంగా ఫొటోలు తీస్తున్నారు. ఇండోర్ స్టూడియోస్‌లో మూడు గంటలకు రూ.6వేలు, 6 గంటలకు రూ.10వేలు చార్జీలు వేస్తున్నారు. స్టూడియో వారితో షూటింగ్ చేయించుకుంటే అదనంగా రూ.4వేలు చెల్లిస్తే తీసిన ఫొటోలను డెవలప్ చేసి సాఫ్ట్‌కాపీని అందిస్తారు. ఇక క్యానెవర 15 ఆల్బమ్ షీట్స్‌ను అదనపు చార్జీలతో అందిస్తున్నారు.

క్రేజీ..ప్రాపర్టీస్..

ఔట్‌డోర్‌కు కావాల్సిన ప్రాపర్టీస్‌ను అద్దె ప్రాతిపదికన లభిస్తున్నాయి. ఇందుకు పట్టణంలో పలువురు ఫొటోగ్రాఫర్స్ ప్రత్యేక ప్యాకేజీల్లో టాయ్స్, కార్స్, పోలీస్, కిచెన్, ఎగ్, మూన్, బైక్స్, కేక్స్‌మ్యాష్ తదితర ప్రాపర్టీస్‌ను అద్దెకు ఇస్తున్నారు. హైదరాబాద్ వంటి నగరాలకు తీసిపోకుండా స్థానిక ఫొటోగ్రాఫర్స్ సిరిసిల్లలోని పార్కులు, లొకేషన్స్‌లో క్యూట్ షూట్స్ నిర్వహిస్తున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లకుండా సెట్టింగ్స్ ద్వారా ఔట్‌డోర్ షూటింగ్స్‌తో చిన్నారుల ఫొటోలను తల్లిదండ్రుల అభిరుచులకు తగ్గట్టుగా అందిస్తున్నారు. ప్రాపర్టీస్‌కు రూ.వెయ్యి నుంచి రూ.4వేల వరకు చార్జీ తీసుకుంటున్నారు. ఫొటోగ్రాఫర్‌కు అదనంగా రూ.4వేలు, ఆల్బమ్ కావాలంటే రూ.4వేల నుంచి రూ. 6వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. పట్టణంలో నిత్యం ఫొటోషూట్స్ జరుగుతున్నాయి.

బర్త్ డే, ప్రత్యేక రోజుల్లో

పుట్టిన నుంచి ఐదేళ్లవరకు చిన్నారులను నెలలు..బర్త్ డే, ఇతర స్పెషల్ డేస్‌కు ఫొటో షూట్స్ చేయిస్తున్నారు. ఇందుకు సిరిసిల్లలో ఇండోర్, ఔట్‌డోర్ షూటింగ్స్ నిత్యకృత్యమయ్యాయి. అందమైన పార్కులు, ప్రకృతి సోయగాల మధ్య, భారీ సెట్టింగ్స్‌తో సినిమా లొకేషన్స్ మాదిరిగా ఇండోర్ షూటింగ్స్‌కు సిరిసిల్ల అడ్డాగా మారింది. పట్టణంతో పాటు జిల్లా నిజామాబాద్, వరంగల్, మెట్‌పల్లి, కోరుట్ల, కామారెడ్డి, దుబ్బాక, కరీంనగర్ తదితర ప్రాంతాల ప్రజలు రావడంతో ఇక్కడి ఫొటోగ్రాఫర్స్‌కు ఉపాధి పెరిగింది.

ఔట్ డోర్ షూట్స్‌కు డిమాండ్



పిల్లల బర్త్‌డేస్, ఇతర ప్రత్యేక రోజుల్లో ఫొటో షూట్స్‌కు నేటితరం వాళ్లు వెనుకాడటం లేదు. చిన్నపిల్లల కోసం ఔట్‌డోర్ ప్రాపర్టీస్ ఏడాదిగా అద్దెకిస్తున్నాం. సిరిసిల్లలో మంచి లొకేషన్స్ ఉన్నాయి. వాటిలో మావద్ద ప్రాపర్టీస్‌తో కలిపి పిల్లలను ఫొటో షూట్ చేస్తాం. ఫొటోగ్రఫీతో పాటు ఆల్బమ్ ఇవ్వాలంటే రూ.12వేల నుంచి చార్జీలు ఉన్నాయి.
– వేముల సాగర్, ఔట్‌డోర్ ఫొటోగ్రాఫిక్స్

బర్త్‌డే ఫొటోలు తీయించాం



మా బాబు మొదటి బర్త్‌డే స్వీట్ మెమోరీగా చేయాలనుకున్నాం. సిరిసిల్లలో ఔట్‌డోర్ ఫొటో షూట్స్ చేయించాం. మంచి ఫొటోలు వచ్చాయి. ఇతర నగరాలకు వెళ్లకుండానే ఔట్‌డోర్ షూట్స్ చేసే మంచి ఫొటోగ్రాఫర్స్ ఉన్నారు. రీజనేబుల్ రేట్స్‌లో ఫొటో షూట్, ఆల్బమ్స్ ఇచ్చారు.
– ఇట్టం రజని–సంపత్, సిరిసిల్ల

స్వీట్ మెమొరీస్



మా ప్రీవెడ్డింగ్, వెడ్డింగ్ ఈవెంట్స్‌ను సిరిసిల్ల ఫొటో గ్రాఫర్స్‌తోనే తీయించాం. మంచి మెమోరీస్ అందించారు. ఎక్కడకి వెళ్లకుండానే ఇక్కడే అందమైన లొకేషన్స్, సీనరీసలతో షూటింగ్స్ జరిగాయి. ఇండోర్ సెట్టింగ్స్ కూడా బాగున్నాయి. ఇతర నగరాల కంటే ఇక్కడ తక్కువ చార్జీ తీసుకుంటున్నారు.
– కాకర్ల శృతి–ప్రశాంత్, సిరిసిల్ల

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులు



బోయినపల్లి: జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు



ముస్తాబాద్ : ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

గంభీరావుపేట: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు రామరాజు అన్నారు. జనవిజ్ఞాన వేదిక, సమగ్రశిక్ష విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం మండలకేంద్రంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలన్నారు. మండలస్థాయిలో నిర్వహించిన పరీక్షలో 39 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కొత్తపల్లి విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. ప్రైవేటు పాఠశాలల విభాగం నుంచి ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికై నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి శీలకుమార్, భాస్కర్, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, జేవీవీ ప్రధాన కార్యదర్శి రమేశ్, అధ్యాపకులు శ్రీవల్లి, విద్యార్థులు పాల్గొన్నారు.
వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.
బోయినపల్లి: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని హైస్కూల్‌లో మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్ష రాసినట్లు ప్రధానోపాధ్యాయుడు కోను భూమయ్య తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఉపాధ్యాయుడు రామకృష్ణ, నర్సయ్య, మధుసూదన్ రెడ్డి, ఆనంద్ విద్యానికేతన్ కరస్పాండెంట్ ఆనందం, తదితరులు పాల్గొన్నారు.
చందుర్తి: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి టాలెంట్ పోటీలు నిర్వహించారు. మూడపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శంకర్, మండల నోడల్ అధికారి వినయ్‌కుమార్ తెలిపారు. విజేతలకు జనవిజ్ఞాన వేదిక బాధ్యులు బహుమతులు అందజేశారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా బాధ్యుడు విక్రర్తి లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు పారం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయుడు పాల్గొన్నారు.
ముస్తాబాద్: చెకుముకి సైన్స్ పోటీల్లో బందనకల్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రణవి, లాస్యప్రియ, అశ్వంత్‌రెడ్డి ప్రతిభ చాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు నోడల్ ఆఫీసర్ రాజిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాజ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.
తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలకేంద్రంలో విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ జిల్లా పండరినాథ్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డైరెక్టర్ మధుకర్ రెడ్డి, గైడ్ టీచర్స్ బాలరాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్



కప్‌తో క్రీడాకారులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శనివారం మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక విలేకరులు కలిసి ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆడారు. ఈ పోటీల్లో విజేతగా మండల పరిషత్ ఆఫీస్ సిబ్బంది, రన్నరప్‌గా ఎంపీటీసీల జట్లు నిలిచాయి. బెస్ట్ బౌలర్‌గా చెటుకూరి కృష్ణమూర్తిగౌడ్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా మోహిజ్ నిలిచారు. విజేతలకు ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీడీవో చిరంజీవి బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో నాయకులు పర్శరాములుగౌడ్, గుండారపు కృష్ణారెడ్డి, కదిరె భాస్కర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, పిల్లి కిషన్, మధు, ఎలగందుల నరసింహులు, జబ్బర్, కానిస్టేబుల్ పంతులు నాయక్, విలేకరులు గౌరీశంకర్, మండల పరిషత్ టైపిస్ట్ రాజు, ఎంసీఆర్‌వో వజీర్ హైమద్ పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి



పద్మారావు (ఫైల్)

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారి రామిండ్ల పద్మారావు (58) గుండెపోటుతో శనివారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం పద్మారావుకు మూడురోజుల క్రితం ఛాతిలో నొప్పిరాగా కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు గుండెకు ఆపరేషన్ చేయించారు. కోలు కుంటున్న క్రమంలో మళ్లీ గుండెపోటు రావడంతో మృతిచెందాడు. మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, నా యకులు, వ్యాపారులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

- మహిళకు తీవ్ర గాయాలు
- మరో ఇద్దరికి స్వల్ప గాయాలు





గాయపడిన దంపతులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని హరిదాస్‌నగర్ బస్‌స్టాప్ సమీపంలో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులతోపాటు చిన్నారి తీవ్రంగా గాయపడ్డారు. వీర్నపల్లి మండలానికి చెందిన సురేశ్, పద్మ దంపతులు సిరిసిల్లలోని పిల్లల ఆస్పత్రిలో తమ మూడునెలల కొడుకుకు వైద్యం చేయించుకొని స్వగ్రామానికి తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన సిద్దిపేట ఏఆర్ ఏఎస్సై జిల్లా లక్ష్మీనర్సాగౌడ్ తన కారుతో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పద్మ కుడికాలు విరగగా, ఆమె భర్త సురేశ్, మూడు నెలల కొడుకు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

సన్నాహక సమావేశానికి తరలిరావాలి



మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఈనెల 28న పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలలిరావాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి అన్నారు. మండలకేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన సమావేశం జరగనున్నట్లు తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, నాయకులు బాల్‌రెడ్డి, అందె సుభాశ్, భాస్కర్‌గౌడ్, సీత్యానాయక్, అనసూయ, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి చింతల మోహన్
- ప్రభుత్వ కళాశాలలో నిత్య జాతీయ పతాకావిష్కరణ



జెండావందనం చేస్తున్న డీఐఈవో, ప్రిన్సిపాల్

సిరిసిల్లకల్చరల్: పట్టణంలోని శివనగర్ ప్రభుత్వ జూనియర్ (కో ఎడ్యుకేషన్) కళాశాలలో ఐదునెలల క్రితం ప్రారంభించిన నిత్య జా తీయ పతాకావిష్కరణ కార్యక్రమానికి శని వారంతో 150 రోజులు నిండాయి. శనివారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి చింతల మోహన్ పతాకావిష్కరణ చేశారు. వైవిధ్యమైన కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తూ రాష్ట్రంలోనే తొలి కళాశాలగా కీర్తి దక్కించుకోవడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో జాతీయ భావాన్ని నింపే పతాకావిష్కరణ స్ఫూర్తిగా ఇష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కనకశ్రీ విజయ రఘునందన్, అధ్యాపకులు దీటి దేవయ్య, బీ వెంకటేశం, కనకయ్య, సామల వివేకానంద్, అరుంధతి, రాజయ్య, లింగం, పి.ఆంజనేయులు, సరోజ విజయ, చంద్రశేఖర్, రాజశేఖర్, శ్రీనివాస్, నవీన్, సరస్వతి, సుజిత, నర్మద, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థిని వెంటనే ప్రకటించాలి



మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: కరీంనగర్ ఎంపీ అభ్యర్థిని కాంగ్రెస్ వెంటనే ప్రకటించాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి పందిర్ల లింగంగౌడ్, పట్టణ అధ్యక్షుడు చెన్ని బాబు అన్నారు. శనివారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థిని ఆలస్యంగా ప్రకటించారని, ఫలితంగా స్వల్ప మెజార్టీతో కేకే మహేందర్ రెడ్డి ఓటమి పాలయ్యారాన్నరు. ఎంపీ ఎన్నికలకు అయినా అభ్యర్థిని తొందరగా ప్రకటించాలని కోరారు. సమావేశంలో నాయకులు వంగ గిరిధర్ రెడ్డి, గంట బుచ్చాగౌడ్, పందిర్ల శ్రీనివాస్‌గౌడ్ ,అంజాగౌడ్, గోపాల్, శ్రీపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శనివారం ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ–వ్యర్థాల నిర్వహణ, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణంపై వివరించారు. భవిష్యత్‌లో ఈ–వ్యర్థాలు పర్యావరణానికి పెను ముప్పుగా మారనున్నట్లు తెలిపారు. కళాశాల ప్రాంగణంలో ఈ–వ్యర్థాల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మీ, రిసోర్స్ పర్సన్ స్వప్న, వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ఆంజనేయులు, కెరీర్ గైడెన్స్ సెల్ కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి కోసమే చెట్ల విక్రయం



సమావేశంలో మాట్లాడుతున్న నాంపెల్లి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేసేందుకు అంకుషాపూర్ చెరువులోని చెట్లను విక్రయించినట్లు సర్పంచ్ భర్త కొయ్యడ నాంపెల్లి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సర్పంచ్ కొయ్యడ ఎల్లవ్వతో కలిసి సమావేశం నిర్వహించారు. ఐదుసార్లు చెరువులోని చెట్లు విక్రయించగా రూ.8.60 లక్షలు వచ్చినట్లు తెలిపారు. పల్లెప్రకృతి వనం కోసం రూ.7.89 లక్షలు ఖర్చుచేయగా ప్రభుత్వం నుంచి రూ.2.33 లక్షలు వచ్చాయని, గ్రామంలో మైసమ్మ, పోచమ్మ, బడిలో ప్రొజెక్టర్, కొత్తచెరువు కోసం రూ.1.49 లక్షలు ఖర్చుచేశామన్నారు. చెట్లు విక్రయించిన డబ్బులు ఖర్చుచేయగా తమకే రూ.1.50 లక్ష రావాలని తెలిపారు. గ్రామస్తుల అంగీకారంతో చెరువులోని చెట్లు అమ్మామని, కొందరు కావాలనే తమపై ఆరోపణలు చేస్తూ డీపీవో, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. అంకుషాపూర్ గ్రామస్తులు నాగరాజు, అంజయ్య, పర్శరాములు, కనుకయ్య, జీల ముత్తయ్య, పెంటల ముత్తయ్య, ప్రశాంత్, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 12న మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక

- సమావేశమైన కౌన్సిలర్లు
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యే పోటీ



వేములవాడ మున్సిపల్ కార్యాలయం

వేములవాడ: వేములవాడ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నికను వచ్చేనెల 12న నిర్వహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఉత్తర్వులు జారీచేశారని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు వైస్‌చైర్మన్‌గా కొనసాగిన మధు రాజేందర్ తన పదవికి రాజీనామా చేశారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ పక్షాన ఉన్న మున్సిపల్ పాలకవర్గం తమ పార్టీనుంచే వైస్ చైర్మన్‌ను ఎన్నుకునేందుకు శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ మేరకు మారంకుమార్ పేరును ప్రతిపాదించినట్లు తెలిసింది. కాంగ్రెస్ నుంచి వైస్‌చైర్మన్‌గా బింగి మహేశ్‌ను బరిలోకి దింపనున్నట్లు తెలుస్తోంది. కేవలం ఏడాది మాత్రమే పదవికాలం ఉండటంతో ఈ పదవిని చేజిక్కించుకునేందుకు పెద్దగా ఆసక్తి కనబర్చడం లేదని చెబుతున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి పోటీకి దిగేవారు కౌన్సిలర్లకు ప్యాకేజీ ప్రకటిస్తున్నట్లు ప్రచారం.

మున్సిపల్ సమావేశాలకు దూరం

చైర్‌పర్సన్ భర్త, వైస్‌చైర్మన్ల మధ్య నెలకొన్న కోల్డ్ వార్ ముదిరి చివరికి వైస్‌చైర్మన్ మధు రాజేంద్రశర్మ తన 23వ వార్డు కౌన్సిలర్‌కు, వైస్‌చైర్మన్ పదవులకు రాజీనామా చేశారు. మొదటిసారి చేసిన రాజీనామా ఆమోదించకపోవడంతో ఆయన అదేస్థానంలో కొనసాగారు. మున్సిపల్ సమావేశాలకు దూరంగా ఉన్నారు. మరోసారి తన వైస్‌చైర్మన్ పదవికి రాజీనామా చేయడంతో ఆమోదించారు. దీంతో వచ్చేనెల 12ననూతన వైస్‌చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు.

సామాజిక సేవకుడు రమేశ్‌కు అవార్డు



రమేశ్

ఎల్లారెడ్డిపేట: సామాజిక కార్యకర్త, రచయిత ఎల్లారెడ్డిపేటకు చెందిన దుంపెన రమేశ్‌కు జాతీయ అవార్డు లభించింది. వరంగల్‌కు చెందిన యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ సేవారత్న జాతీయ పురస్కారం ప్రకటించింది. ఫిబ్రవరి 4న హన్మకొండలో నిర్వహించే కార్యక్రమంలో పురస్కారాన్ని అందజేయనున్నారు.